క్లుప్తంగా

స్తంభం ఇలా.. రాకపోకలెలా?



జ్యోతినగర్‌లో దారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు జ్యోతినగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం కారణంగా స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఓ వీధి నుంచి వెనుక వీధికి చిన్న రహదారి ఉంది. గతంలో నివాసాలు తక్కువగా ఉండడంతో ఖాళీగా ఉన్న స్థలంలో కాలువ అంచున అధికారులు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ స్తంభం రాకపోకలకు అడ్డు కాలేదు. ఇప్పుడు నివాసాలు పెరిగి స్తంభానికి దగ్గరగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో రహదారి కుచించుకుపోవంతో పాటు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం స్థానికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు ఈ స్తంభాన్ని తొలగించి విశాలంగా ఉన్న రోడ్డు పక్కన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను ప్రదర్శిస్తున్న చెఫ్

ఎంవీపీ కాలనీ: వినూత్న వంటకాలతో కూడిన బావో ఫుడ్ ఫెస్టివల్ నొవొటెల్‌లో వచ్చేనెల ఒకటో తేదీన ప్రారంభం కానుంది. ఈ మేరకు మంగళవారం హోటల్‌లోని రెడ్ భౌల్ ద పాన్ ఆసియన్ కిచెన్ రెస్టారెంట్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకురాలు మనాలి ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు. బ్రెడ్‌తో కూడిన చైనీస్ వంటకాలకు ఈ ఫెస్టివల్ ప్రసిద్ధి అని చెప్పారు. వచ్చే నెల 10వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఫెస్టివల్‌లో వెజ్, నాన్ వెజ్‌లలో పలు రకాల వంటకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

షాపులకు వేలం నేడు

జగదాంబ : జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో మార్కెట్లు, దుకాణ సముదాయాలకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్ణా మార్కెట్, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి మార్కెట్, వాణిజ్య సముదాయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయంలో మొదటి అంతస్తు, 31వ వార్డులోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 9వ నంబర్ షాపు, లక్ష్మీ టాకీస్ వద్ద పద్మానగర్ వాణిజ్య సముదాయంలోని దుకాణాలు, 35వ వార్డు ఫ్రూట్‌మార్కెట్ వద్ద ఉన్న దుకాణ సముదాయంలోని 1 నుంచి 15 షాపులకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడల లోగో ఆవిష్కరణ



క్రీడల లోగో ఆవిష్కరణలో పాల్గొన్న డాక్టర్ అశోక్‌కుమార్, తదితరులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న మెగా స్పోర్ట్స్ కార్నివాల్‌కు సంబంధించిన లోగోను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని ఆంధ్రా మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రుల ఉద్యోగులు, సిబ్బందితో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మాలి తదితరులు పాల్గొన్నారు.

రూ.3.76 కోట్లతో పెదగదిలి వంతెన



గెడ్డ మధ్య నుంచి తాత్కాలికంగా వేస్తున్న రోడ్డు

- వారం రోజులుగా చురుగ్గా పనులు
- రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- గెడ్డ మధ్య నుంచి తాత్కాలిక మార్గం నిర్మాణం



పెదగదిలి బ్రిడ్జి వద్ద వంతెన నిర్మాణం కోసం తవ్విన రోడ్డు

ఆరిలోవ: పెదగదిలి, తోటగరువు మధ్య గెడ్డపై వంతెన నిర్మాణ పనులు వారం రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఇక్కడి రహదారి మూతపడింది. పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే దారిని విస్తరించి డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు గెడ్డపై ప్రస్తుతం ఉన్న ఇరుకు బ్రిడ్జిని తొలగించి కొత్తగా వెడల్పయిన వంతెన నిర్మాణం కోసం ఇటీవల మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.3.76 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా గెడ్డలో నీరు కిందకు పోవడానికి వీలుగా బ్రిడ్జి పక్క నుంచి రోడ్డును తవ్వి ప్రత్యామ్యాయం మార్గం ఏర్పాటు చేశారు. దీంతో పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే రహదరిని మూసివేశారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలకు ఈ మార్గంలో బ్రేక్ పడింది. నగరం నుంచి ఆరిలోవ కాలనీకి రాకపోకలు సాగిస్తున్న సిటీ బస్సులను చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద కూడలి మీదుగా మళ్లించారు. మరో వైపు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పెదగదిలి, చినగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, నగరం నుంచి వచ్చే ఉపాధ్యాయులు, పెదగదిలి వెళ్లాల్సిన తోటగరువు వాసులు సౌలభ్యం కోసం అధికారులు మంగళవారం ప్రత్యామ్నాయంగా మట్టి రహదారిని ఏర్పాటు చేశారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం పొక్లెయిన్‌తో చదును చేయించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినంత వరకు ఈ ప్రత్యామ్నాయం మార్గాలు అందుబాటులో ఉంటాయని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రజల కష్టాలు తీర్చడమే సీఎం జగన్ లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 19, 20 వార్డుల్లో ఉత్సాహంగా పాదయాత్ర



19వ వార్డులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఇస్త్రీ చేస్తున్న మహిళతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర మంగళవారం 19, 20వ వార్డుల్లో ఉత్సాహంగా కొనసాగింది. యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ 30వ రోజు 19వ వార్డులో జాలరి ఎండాడ, వాసవానిపాలెం ప్రాంతాల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులైన మహిళలు ఎంపీకి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల కష్టాలు తీర్చడమే జగనన్న పాలన లక్ష్యమన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించడం సాధ్యమైందన్నారు. గ్రామాల్లో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్‌కు దీటుగా ఆధునికీకరించి, గ్రామీణ చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశామన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాకారం

ఏయూ క్యాంపస్: ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీ పాలనతోనే సాకారమైందని ఎంపీ, పార్టీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 20వ వార్డు కొయ్యవీధి, రజకవీధి, మధురవీధి ప్రాంతాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మువ్వల లక్ష్మీతో కలిసి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రవికిరణ్‌రెడ్డి, మువ్వల సురేష్, కన్వీనర్ పాపారావు, నరేష్, తిలక్, దిల్ రాజు, నరసింగరావు, శంకర్, సాయి, శ్రీను, అశోక్, చంద్రాన బాబులు, పద్మజ, ప్రదీప్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముద్ర రుణాలు రూ.10 లక్షలకు పెంచాలి



జోనల్ మేనేజర్‌ను సత్కరిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: స్వర్ణకారులకు ముద్ర కిషోర్ యోజన కింద ఇండియన్ బ్యాంకు రూ.5 లక్షలు మాత్రమే అందిస్తుందని, అలా కాకుండా ముద్ర తరుణ్ పథకం ద్వారా రూ.10 లక్షలకు పెంచాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేశ్ కుమార్ పుర్వేను మంగళవారం జోనల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. స్వర్ణకారులు తీసుకున్న ముద్ర రుణాల చెల్లింపులు 97 శాతం సక్రమంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో విశాఖ నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెదపూడి బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ

బీచ్ రోడ్డు: బల్లల పండగను జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డలో రజకులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. రజక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వార్డు నాయకులు నక్కల త్రినాథ్, భవాని శంకర్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థుల సందర్శన



రిజిస్ట్రార్ స్టీఫెన్‌తో ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఎన్ఐటీ రూర్కెలా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అట్మాస్ఫియరిక్ సైన్స్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు మంగళవారం సందర్శిచారు. పురాతనమైన వాతావరణ-సముద్ర అధ్యయన శాస్త్ర విభాగంలో ఉన్న మౌలిక వసతులు, ప్రాజెక్టులు, మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ పరికరాలను ప్రత్యక్షంగా తిలకించారు. విభాగ ఆచార్యులతో మాట్లాడి, బోధన, పరిశోధన వసతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని సందర్శించడం, ఇక్కడ ప్రత్యేకతలను తెలుసుకోవడంపై ఎన్ఐటీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల బృందం ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సునీత, ఆచార్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా సాహిత్యంతో విలువలపై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం-జనరంజక వీణానాదం'అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒక వైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తుందన్నారు. ప్రత్యేక అతిథి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.శంకరరావు మాట్లాడుతూ సాహిత్యంలో అద్భుతమైన పాటలు రాసి సాహిత్యపు విలువలు పెంపొందించిన సినీ గేయ రచయిత దాశరథి అని కొనియాడారు. ఎటువంటి అశ్లీలత దొర్లకుండా విలువలతో కూడిన సాహిత్యం అందించారన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన 90వ పుస్తకం రావిశాస్త్రి రచనలు-అభ్యుదయ దృక్పథం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అంకితం చేసినట్లు ఆచార్య సిమ్మన్న తెలిపారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బి.వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాల మెస్ ఆకస్మిక తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థుల మెస్‌ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేసి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీ విధానం, కిచెన్‌ను తనిఖీ చేశారు. తరచూ మెస్‌లను వార్డెన్లు, సహాయక వార్డెన్లు తనిఖీ చేయాలని, విద్యార్థులకు పరిశుభ్రత వాతావరణంలో, రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. చీఫ్ వార్డెన్‌లు ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ జి.వీర్రాజు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం.. తెలుగు మ్యూజియం రహదారి



కైలాసగిరిపై తెలుగు మ్యూజియంకు వెళ్లే రోడ్డు

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై తెలుగు మ్యూజియం రహదారి పచ్చని చెట్ల మధ్య ఆహ్లాకర వాతావరణంలో కళకళలాడుతోంది. కైలాసగిరి నిత్యం సందర్శకులతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ తెలుగు మూజియంకు వెళ్లే రహదారిని వీఎంఆర్‌డీఏ అధికారులు పచ్చని చెట్ల మధ్య ఏర్పాటు చేశారు. ఇరువైపులా ఏపుగా పెరిగే గుబురైన చెట్ల మధ్య ఈ రోడ్డు సన్నగా సొరంగంలా కనిపిస్తుంది. ఇక్కడికి వెళ్లిన సందర్శకులు ఎక్కువ మందికి తెలుగు మ్యూజియం ఎక్కడుందో తెలియదు. దీంతో ఈ రహదారి ఎటు వెలుతుందో తెలియక కొందరు సందర్శకులు దూరం నుంచే వెనుదిరుగుతున్నారు. ఇక్కడ సర్క్యూట్ ట్రైన్ ట్రాక్ కొండపైన మధ్యలో ఉంటుంది. అక్కడి నుంచి చెట్ల మధ్య సన్నని రోడ్డు తప్పా ఇతర పార్కులు ఏమీ కనిపించవు. గుబురుగా ఉండే చెట్ల మధ్య ఉన్న తెలుగు మ్యూజియం కూడా ఈ సర్క్యూట్ ట్రైన్ ట్రాక్ నుంచి సందర్శకులకు కనబడడంలేదు. ట్రైన్ ట్రాక్ వద్ద అధికారులు మ్యూజియం ఉన్నట్లు సూచీ బోర్డు ఏర్పాటు చేస్తే సమాచారం ఇచ్చినట్లవుతుందని సందర్శకులు భావిస్తున్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో బదిలీల జాతర



ఆరిలోవ పోలీస్ స్టేషన్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో అధికారుల బదిలీల జాతర కొనసాగుతోంది. సాధారణ ఎన్నికల గడువు దగ్గరపడుతుండటంతో ఈ బదిలీలు ఊపందుకున్నాయి. ఈ స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసులతో ప్రారంభమైన ఈ బదిలీలు లా అండ్ ఆర్డర్ విభాగం పోలీసులలో ఇంకా కొనసాగుతోంది. రెండు, మూడు రోజుల్లో మరికొంత మందికి బదిలీలు జరగనున్నట్లు పోలీస్ అధికారుల చెబుతున్నారు. దీంతో ఈ స్టేషన్‌లో అంతా కొత్త పోలీస్ ముఖాలే కనిపించనున్నాయి. ఇక్కడ లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా పనిచేస్తున్న సీహెచ్.సూర్యనారాయణను దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా నుంచి వై.కృష్ణ బదిలీపై ఆరిలోవకు రానున్నారు. ఈ స్టేషన్ నుంచి నెల క్రితం ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలకు బదిలీలు జరిగాయి. వారి స్థానంలో కొత్త సీఐ, ఎస్ఐలు బాధ్యతలు చేపట్టారు. రెండు వారాల క్రితం లా అండ్ ఆర్డర్ విభాగం నుంచి ఎస్ఐ అనిల్‌కుమార్‌కు శ్రీకాకుళం బదిలీ కాగా, ఆయన స్థానంలో శ్రీకాకుం నుంచి హరికృష్ణ బదిలీపై వచ్చి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. వారం క్రితం ఇక్కడ సీఐ సోమశేఖర్‌కు శ్రీకాకుళం బదిలీ అయింది. ఆయన స్థానంలో పెందుర్తి స్టేషన్ నుంచి శ్రీనివాసరావుని ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. కొత్త సీఐ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇక్కడ నుంచి సోమశేఖర్ రిలీవ్ కానున్నారు.

గాయని సాహితికి వేటూరి పురస్కారం



సాహితికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితికి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత వేటూరి 98వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ×ఎదలో మోహన లాహిరి×శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటూరి పేరిట పురస్కారానికి సాహితీ ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సాహితీ, రమేష్ పట్నాయక్ ఆలపించిన వేటూరి గీతాలు అలరించాయి. గంటి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, ఉసిరికాయల చంద్రశేఖర్, సుహాసిని ఆనంద్, దాడి సత్యనారాయణ, కళా సంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, ఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి ఒకటిన సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

గాంధీజీ సేవలు చిరస్మరణీయం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్‌స్టీఫెన్

ఎంవీపీ కాలనీ: మహాత్మ గాంధీజీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా లాసన్స్‌బే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గాంధీ అనుసరించిన అహింసా విధానాలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, గేదెల నాగరాజు, అక్కరమాని రోహిణి, సూరాడ దాసు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో అహింస ఉత్సవాలు

అఖిల భారత సర్వోదయ సంస్థల ఆధ్వర్యంలో రామకృష్ణా బీచ్‌లో అహింస ఉత్సవాలు సోమ, మంగళవారాల్లో ఘనంగా నిర్వహించారు. సంస్థ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌చంద్ర, ప్రముఖ గాంధేయవాది జుబెరుల్ల ఖాన్, విశ్రాంత ఆచార్యుడు కోటి జాన్ తదితరులు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్షమాగుణం, ప్రేమ గాంధీజీ సందేశం

ఏయూ క్యాంపస్: క్షమాగుణం, ప్రేమ గాంధీజీ ప్రపంచానికి అందించిన సందేశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. మంగళవారం ఉదయం మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన హరిత గాంధేయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేచ్ఛను ఆస్వాదిస్తున్న మనం స్వాతంత్య్ర సముపార్జన కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన వారిని గుర్తు చేసుకోవాలన్నారు. గాంధీజీ తత్వాన్ని, ఆలోచనలను నేటి తరానికి అందించేలా కేంద్రం కృషి చేయాలన్నారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆలోచనల మధ్య సారూప్యతలను వివరించారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ఆచరణాత్మక మార్గాలను గాంధీజీ చూపారన్నారు. స్వార్థం, స్వప్రయోజనం, హింస నేడు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, మత, ప్రాంతాల వారీగా ప్రజలు విడిపోతున్నారని, ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ ఉత్తమ వ్యక్తిత్వ లక్షణాలు కలిగిన సంపూర్ణ రూపంగా గాంధీజీ నిలుస్తారన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ గాంధీజీ ఆలోచనలను తమ మాటల్లో వివరించారు. గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య ఎ.బి.ఎస్.వి.రంగారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

మూడో పట్టణ సీఐగా పార్థసారథి

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.పార్థసారథిని నియమిస్తూ మంగళవారం నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఐగా ఉన్న కోరాడ రామారావు విజయనగరం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయిన విషయం విదితమే. పార్థసారథిని వీఆర్ నుంచి పోస్టింగ్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



బంతి, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



వివిధ పువ్వులతో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి, చామంతి, గజమాలలతో అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జీరు వాసురెడ్డి ఆర్థిక సహకారంతో అలంకరణ పూర్తి చేశారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి సేవలో ఉంటున్న పోతల నరసయ్యమ్మకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, ఓఎస్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు 9 రకాల పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.